

అందెల రవమిక ముగిసినది



మూడు రోజులుగా కూచిపూడిలో నిర్వహిస్తున్న కూచిపూడి నాట్య స్వర్ణోత్స వాలు ఆదివారంతో ముగిశాయి. ఒకే వేదికపై 2 వేల మంది కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ఔరా అనిపించాయి. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూచిపూడి నాట్యమనే దీపాన్ని దేదీప్యమానంగా వెలుగొందేలా అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరో మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు.



6



ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ముగింపు సభలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

మురిసిన తెలుగు సందడి

ముగిసిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ● 18 తీర్మానాలకు ఆమోదం ● ఆసక్తిగా 'తెలుగులో న్యాయపాలన'

తెలుగు రచయితల సందడి ముగిసింది. విజయవాడ కేబీఎన్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల 6వ మహాసభలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. మాతృభాషతో ముడిపడిన వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించారు. విద్యార్థుల్లో రచనా సామర్థ్యం, భాషా నైపుణ్యం పెంచడానికి యువకవి సమ్మేళనాలు నిర్వహించారు. భాష పరిరక్షణకు అడుగులు పడాల్సిన మార్గాలను విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు స్పష్టం చేశారు. మొత్తంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ప్రాథమిక విద్య నుంచి తెలుగు తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన తెలుగు మాధ్యమాన్ని తిరిగి పునరుద్ధరించాలని వక్తలు, ప్రతినిధులు పట్టుబట్టారు. ముగింపు సభలో మొత్తం 18 తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించారు. అన్నింటిలో న్యాయపాలనపై తెలుగులో సాగిన సదస్సు ఆసక్తికరంగా ఉంది. తెలుగు భాషను పదిలం చేసుకోవడానికి ప్రజలు, రాజకీయ నేతలు, ప్రభుత్వాలు, రచయితలు, మేధావులు చేయిచేయి కలిపి అడుగులు వేయాలని ఈ మహాసభలు దిశానిర్దేశం చేశాయి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నలుగురు అరెస్టు

- ఫోక్సో కేసు నమోదు

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- ఘనంగా ప్రపంచ మాదిగ దినోత్సవం



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

6లో

పేర్ని గోడౌన్‌లో బియ్యం మాయం కేసులో దర్యాప్తు వేగవంతం



పోలీసుల అదుపులో పేర్ని నాని గోడౌన్‌ల మేనేజర్ మానస్ తేజ!

- 100 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బందితో విచారణ
- జిల్లాలోని అన్ని టోల్‌గేట్‌ల వద్ద పీడీఎస్ బియ్యం లారీల రవాణాపై రికార్డుల పరిశీలన
- గతంలో పనిచేసిన పౌరసరఫరాలశాఖ అధికారుల నుంచి వివరాలు సేకరణ
- నేడు పేర్ని జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం



పొట్లపాలెంలో పేర్ని నానికి చెందిన గోడౌన్

మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌ల నుంచి 387 టన్నుల పీడీఎస్ బియ్యం మాయం కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గోడౌన్ రికార్డులను పౌరసరఫరాలశాఖ అధికారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ రికార్డుల ఆధారంగా పేర్ని నాని లారీలు ఎక్కడకు తరలిపోయాయి అనే అంశాలపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేస్తున్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది వంద మందికిపైగా ప్రత్యేక బృందాలు ఏర్పడి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లాలోని టోల్‌గేట్‌ల వద్ద పేర్ని నాని గోడౌన్ నుంచి, మచిలీపట్నం తదితర ప్రాంతాల నుంచి పేర్ని నాని గోడౌన్‌లకు బియ్యం లోడుతో వెళ్లిన లారీల నంబర్ల ఆధారంగా అవి ఎటు నుంచి ఎక్కడికి ప్రయాణించాయి అనే అంశంపై పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వివరాలు సేకరిస్తున్నారు. జాతీయ రహదారి 216-ఏ బంటుమిల్లి టోల్‌గేట్ వద్ద పేర్ని నాని గోడౌన్‌ల నుంచి ఆరు లారీల పీడీఎస్ బియ్యం కాకినాడ తదితర ప్రాంతాల వైపు తరలిపోయినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు విశ్వసనీయ సమాచారం.

-ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

హైదరాబాద్‌లో అదుపులోకి..

మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌ల మేనేజర్, పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఏ-2 నిందితుడిగా ఉన్న మానస్ తేజను పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. గత 20 రోజులుగా మానస్ తేజ అజ్ఞాతంలోనే ఉన్నాడు. అతని బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. మూడు పోలీస్ బృందాలు అతని ఆచూకీ కోసం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. మానస్ తేజ బంధువులు ఎక్కడ నివాసం ఉంటున్నారు, వారి ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు హైదరాబాద్‌లో అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతన్ని మచిలీపట్నం తరలించిన పోలీసులు రహస్య ప్రాంతంలో ఉంచి విచారణ చేస్తున్నారు. ఈ మేనేజర్ బ్యాంకు ఖాతా లావాదేవీలకు సంబంధించిన వివరాలను రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు. అతని బ్యాంకు ఖాతాలో ఎవరెవరి నుంచి ఎప్పుడు నగదు జమ అయ్యిందనే అంశాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. లక్షలాది రూపాయలు గోడౌన్ మేనేజర్ బ్యాంకు ఖాతాలో జమ అయినట్లుగా పోలీసులు విచారణలో తేలినట్లు సమాచారం. అయితే మానస్‌తేజను అదుపులోకి ఇంకా తీసుకోలేదని, పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు. మానస్‌తేజతో పాటు గోడౌన్‌లో పనిచేసే హమాలీలలో కీలకవ్యక్తులు, లారీడ్రైవర్‌లను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని బియ్యం తరలింపుపై విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పౌరసరఫరాలశాఖ అధికారులకు నోటీసులు

పేర్ని నానికి సంబంధించిన గోడౌన్‌ను ప్రభుత్వం అద్దెకు తీసుకున్న నాటి నుంచి పౌరసర ఫరాల శాఖలో పనిచేసిన అధికారులకు పోలీసులు విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌లుగా, ఇన్‌చార్జి మేనేజర్‌లుగా పనిచేసి శ్రీధర్, రాజు, సతీష్, సృజనలకు ఆర్‌పేట పోలీసులు నోటీసులు ఇచ్చారు. వీరి నుంచి పోలీ సులు వివరాలు సేకరించి రికార్డు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది అధికారులు విచారణ నిమిత్తం రాగా, మిగిలిన వారిని ఒకటీ రెండురోజుల్లో రావాలని నోటీసులు అందజేశామని ఆర్‌పేట సీఐ ఏసు బాబు తెలిపారు. గోడౌన్‌లను తనిఖీ చేసే సాంకే తిక సిబ్బంది నుంచి సైతం పోలీసులు వివరాలు రికార్డు చేస్తున్నారు. గోడౌన్‌లను అద్దెకు తీసుకున్న నాటి నుంచి ఏయే నెలల్లో అధికారులు పరిశీలన చేశారనే వివరాలు రాబట్టి, పోలీసులు తమ వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ఏయే నెలల్లో బియ్యం లెక్కల్లో తరుగు అధికంగా ఉందనే అంశంపై వివరాలు నమోదు చేసుకుంటున్నారు.

ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నేడు తీర్పు

పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఈ నెల 10వ తేదీన గోడౌన్ యజమానిగా ఉన్న పేర్ని జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆమె జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో బెయిల్ పిటిషన్ పలుమార్లు వాయిదా పడింది. సోమవారం తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఒకవైపు బియ్యం మాయం కేసులో పోలీసులు విచారణ చేస్తున్నారు. పేర్ని జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనే అంశంపై చర్చ జరుగుతోంది.

అగ్రిమెంట్ దస్తావేజులు కానుమోలు నుంచి తెచ్చారా!

పేర్ని నానికి సంబంధించిన గోడౌన్ అగ్రిమెంట్ ఈ ఏడాది జనవరి నెలలో రెన్యువల్ చేశారు. ఈ అగ్రిమెంట్ పత్రాలను హనుమాన్‌జంక్షన్ సమీపంలోని కానుమోలు నుంచి తీసుకువచ్చి వాటిపై సంతకాలు చేయించడం గమనార్హం. ఈ ఒప్పంద పత్రాలపై అధికారులు ఎప్పుడు సంతకాలు చేశారనే అంశంపై ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి నిజాలు నిగ్గుతేల్చాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేయడంతోపాటు మచిలీపట్నం తాలూకా పోలీసులకు అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశారు.



ఉమ్మడి కృష్ణాజిల్లాలో గతంలో జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ(జైకా) నిర్దేశించిన అలైన్‌మెంట్ పరిధిలోనే ప్రస్తుత అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్ కూడా కొనసాగనున్నట్లు తెలిసింది. దీనిపై డీపీఆర్ తయారవుతున్న నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అలైన్‌మెంట్ పలు చోట్ల స్వల్పంగా మారే అవకాశం ఉన్నా.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మాత్రం మార్పులు లేకపోవచ్చని సమాచారం. కృష్ణాజిల్లాలో ఈస్ట్ బైపాస్, ఓఆర్ఆర్ సమాంతరంగా వెళ్లనున్న నేపథ్యంలో వాటి మధ్యన ఉన్న భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. అదేవిధంగా ఈ ఓఆర్ఆర్‌తో ఉమ్మడి కృష్ణాజిల్లా మరింత అభివృద్ధి చెందనుంది.



అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

యథాతథం

ఉమ్మడి కృష్ణాలో మారని అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్!

- ఎన్టీఆర్ జిల్లాలో పొట్టిపాడు నుంచి కంచికచర్ల వరకు..
- కృష్ణా జిల్లాలో పొట్టిపాడు నుంచి చినపులిపాక వరకు..
- సమాంతరంగా కృష్ణాజిల్లాలోకి వెళ్లనున్న ఈస్ట్ బైపాస్, ఓఆర్ఆర్
- ఈస్ట్ బైపాస్, ఓఆర్ఆర్‌ల మధ్యలోని భూముల ధరలకు రెక్కలు
- ఓఆర్ఆర్‌తో అభివృద్ధి చెందనున్న ఉమ్మడి కృష్ణాజిల్లా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనే 189 కిలోమీటర్ల మేర నాటి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను జైకా సంస్థ రూపొందించింది. జైకా అందించినఅలైన్‌మెంట్ ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో పొట్టిపాడు నుంచి కంచికచర్ల వరకు, పొట్టిపాడు నుంచి వుయ్యూరు వరకు అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు వెళ్తోంది. అప్పట్లో సీఆర్‌డీఏ నేతృత్వంలో ఈ ప్రాజెక్టును చేపట్టాలని భావించారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ ప్రాజెక్టును జాతీయ రహదారుల సంస్థ ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎన్‌హెచ్ నేతృత్వంలో ఓఆర్ఆర్ అలైన్‌మెంట్, డిజైన్లకు సంబంధించిన డీపీఆర్ తయారవుతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పునూ సూచించటం లేదని తెలుస్తోంది.

ఓఆర్ఆర్ వెళ్లే గ్రామాలు ఇలా..

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల దిగువన మున్నలూరు, కునికనపాడు మధ్య నుంచి ప్రారంభమవుతుందని సమాచారం. మోగులూరు, కంచికచర్ల, పెరకలపూడి, పొన్నవరం, జగన్నాథపురం, చెన్నారావుపాలెం, తిమ్మాపురం, పేత్రంపాడు, గుర్రాజుపాలెం, నందిగామ, కోడూరు, బూదనపల్లె, గరికపాటివారి కండ్రిక, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి, ఆగిరిపల్లి, నరసింగపాలెం, నగ్గూరు అమాని, నగ్గూరు, సూరవరం, బండారుగూడెం, అంపాపురం - బల్లిపర్రు మధ్యన, తేలప్రోలు - తెంపల్లె మధ్యన, పొట్టిపాడు వరకు వస్తుంది. కృష్ణాజిల్లా పరిధిలో పొట్టిపాడు నుంచి ఆత్కూరు, తుట్టగుంట, వెన్నూతల, నాగవరప్పాడు - బూతుమిల్లిపాడు మధ్యన, వెల్దిపాడు, వెల్దిపాడు కండ్రిక, తరిగొప్పుల ఎగువన, వేంపాడు, మారేడుమాక, బొకినాల, నెప్పల్లి, దావులూరు, చలివేంద్రపాలెం, బోడపాడు, చినపులిపాకల వరకు అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కొనసాగుతోంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కృష్ణాజిల్లాలో ఈస్ట్ బైపాస్‌తో అత్యంత దగ్గరగా వెళుతుంది. ఈస్ట్ బైపాస్, అవుటర్ రింగ్ రోడ్డు మధ్యన ఉన్న గ్రామాలు, పట్టణాలలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవటానికి అవకాశం ఉంది. విజయవాడ ఈస్ట్ బైపాస్, ఓఆర్ఆర్‌లు రెండూ కూడా కృష్ణాజిల్లాలో పొట్టిపాడు నుంచి చినపులిపాక వరకు సమాంతరంగా కొనసాగుతాయి. దీంతో కృష్ణాజిల్లా అటు వుయ్యూరు, పామర్రు వరకు, మరోవైపు ఏలూరు వరకు, ఇంకో వైపు నందిగామ వరకు అభివృద్ధి చెందటానికి అవకాశాలు ఏర్పడనున్నాయి.

మెట్రో హారం

బెజవాడలో ఖరారైన స్టేషన్లు!

- కారిడార్ - 1లో 22, కారిడార్ - 2లో 12
- పీఎన్‌బీఎస్ వద్ద ప్రధాన స్టేషన్
- అమరావతిలో విస్తరించే కారిడార్-3కి పీఎన్‌బీఎస్ అనుసంధానం
- నిడమానూరు నుంచి రామవరప్పాడు వరకు కారిడార్-1లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్
- కేవలం దీనికే రూ. 1000 కోట్లని అంచనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మెట్రో రైల్ స్టేషన్లు ఖరారయ్యాయి. తొలి దశలో గన్నవరం నుంచి ఏలూరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-1, పెనమలూరు సెంటర్ నుంచి పీఎన్‌బీఎస్ సెంటర్ వరకు కారిడార్-2ను చేపట్టబోతున్న సంగతి తెలిసిందే. ఈ రెండు కారిడార్లకు సంబంధించి మెట్రో రైళ్లలో ప్రయాణించటానికి వీలుగా మొత్తం 34 మెట్రో స్టేషన్లకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీఎల్) ఖరారు చేసింది. ఇందులో కారిడార్ - 1లో 22 మెట్రో స్టేషన్లను ఖరారు చేయగా.. కారిడార్ - 2 లో 12 మెట్రో స్టేషన్లను ఖరారు చేసింది. కారిడార్ - 1 ఎన్‌హెచ్ - 16 మీదుగా వీఐపీ కారిడార్‌లో గన్నవరం నుంచి రామవరప్పాడు రింగ్ వరకు సాగుతుంది. అక్కడి నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్‌కు చేరుకుంటుంది. ఈ కారిడార్‌లో గన్నవరం బస్టాండ్, గన్నవరం సెంటర్, యోగాశ్రమం, విజయవాడ ఎయిర్‌పోర్టు, కేసరపల్లి, వేల్పూరు, గూడవల్లి, శ్రీ చైతన్య కాలేజీ, నిడమానూరు రైల్వేస్టేషన్, నిడమానూరు, ఎనికేపాడు, ఎంబీటీ సెంటర్, ప్రసాదంపాడు, రామవరప్పాడు రింగ్, గుణదల, పడవలరేవు, మాచవరం డౌన్, సీతారామపురం సిగ్నల్, బీసెంట్ రోడ్డు, రైల్వేస్టేషన్ ఈస్ట్, రైల్వేస్టేషన్ సౌత్, పీఎన్‌బీఎస్ దగ్గర మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మెట్రో స్టేషన్లు పూర్తిగా ఎలివేటెడ్ విధానంలో ఉంటాయి. తొలిదశలో చేపట్టే మరో కారిడార్-2లో పెనమలూరు సెంటర్, పోరంకి, తాడిగడప, కానూరు సెంటర్, కృష్ణానగర్, అశోక్‌నగర్, ఆటోనగర్, బెంజ్‌సర్కిల్, టిక్కిల్ రోడ్, మునిసిపల్ స్టేడియం, విక్టోరియా జూబిలీ మ్యూజియం, పీఎన్‌బీఎస్ వద్ద ఈ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇవన్నీ బందరు రోడ్డు మధ్యభాగంలో ఎలివేటెడ్ విధానంలో ఏర్పాటు చేస్తారు. పండిట్ నెహ్రూ బస్టేషన్ వద్ద పీఎన్‌బీఎస్ తరహాలో ప్రధాన మెట్రోస్టేషన్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రధాన మెట్రో స్టేషన్ భవిష్యత్తులో అమరావతికి విస్తరించే మెట్రో కారిడార్ - 3 కు అనుసంధానంగా ఉంటుంది. ప్రధాన మెట్రో స్టేషన్‌ను ఎన్‌హెచ్ - 65 పై ఎలివేటెడ్ విధానంలో నిర్మిస్తారు. పీఎన్‌బీఎస్‌లో కొంత మేర భూమిని ఇప్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని మెట్రో కార్పొరేషన్ కోరబోతోంది. కారిడార్ -1లో నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు నాలుగున్నర కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ఏర్పాటు కానుంది. నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఎన్‌హెచ్ నేతృత్వంలో 6.50 కిలోమీటర్ల ఫ్లై ఓవర్ మంజూరైన సంగతి తెలిసిందే. ఇదేమార్గంలో మెట్రో కారిడార్ రామవరప్పాడు రింగ్ వరకు వెళుతున్న నేపథ్యంలో ఇక్కడి వరకు దీన్ని డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌గా నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన డిజైన్‌ను కూడా మెట్రో రైల్ కార్పొరేషన్ చేపడుతోంది. కేవలం ఒక్క డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికే రూ.1000 కోట్లు వ్యయం అవుతుందని తెలుస్తోంది.

మువ్వల సవ్వడి.. మురిసె కూచిపూడి



ముగిసిన కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు ● ఒకే వేదికపై 2 వేల మంది ప్రదర్శన

కూచిపూడి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కూచిపూడి నాట్య స్వర్ణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఒకే వేదికపై 2 వేల మంది కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు మయూరాలు పురివిప్పి నాట్యమాడిన అనుభూతిని కలిగించాయి. మువ్వల సవ్వడికి..కూచిపూడి గ్రామం మురిసి, పులకించిపోయింది. వందే వందే వాణి భవానీ, రాజగోపాలం..రాధాలోలం అంశాలను 2 వేల మంది కళాకారులు ముందుగా ప్రదర్శించారు. అనంతరం వేదవల్లి ప్రసాద్ బృందం ఆధ్యాత్మిక రామాయణ కీర్తన, కృష్ణజనన శబద్ధం, బుడి బుడి నడకల అంశాన్ని ప్రదర్శించి ఆద్యంతమూ భక్తిభావంలో ముంచెత్తారు. కనకదుర్గ బృందం థిల్లానా అంశాన్ని ప్రదర్శించి మెప్పించారు. అన్నమయ్య మ్యూజికల్ అండ్ డ్యాన్స్ కళాశాల బృందం బ్రహ్మాంజలి, దశవతారం అంశాలు ప్రదర్శించి ఔరా అనిపించారు. కరణం శ్రీనివాస్ బృందం వినాయక స్తుతి, వసంత స్వరజతి అంశాలు ప్రదర్శించగా, చివరిగా సరితా నెహ్రూ బృందం కథన కుతూహల థిల్లానా, పంచాక్షరీ అంశాల్లో చూపిన హావభావాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాకారులను, అతిథులను ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకటా చలపతి జ్ఞాపికలు అందించి సత్కరించారు.

ప్రపంచాన్ని కూచిపూడి ఆకర్షిస్తున్నా..

కూచిపూడిలో నాట్యాంశాలు ప్రదర్శిస్తున్న నృత్యకారిణులు

రాష్ట్రంలో ఆదరణ కొరవడడం బాధాకరం

» కూచిపూడి నాట్యకళ అభివృద్ధికి కృషి చేద్దాం..

» స్వర్ణోత్సవ ముగింపు వేడుకల్లో మంత్రి కందుల దుర్గేశ్

కూచిపూడి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ చరిత్రలో ఊరు పేరుపై ఉన్న ఏకైక నాట్యకళ కూచిపూడి. ప్రపంచ దేశాలను కూచిపూడి నాట్యం ఆకట్టుకుంటోంది. ఏపీలో ఈ కళకు ఆదరణ కొరవడడం బాధకరం.' అని సాంస్కృతిక, పర్యాటక శాఖ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. కూచిపూడి నాట్య పతాక స్వర్ణోత్సవ ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 50 వసంతాల పతాక స్వర్ణోత్సవాల సందర్భంగా 50 అడుగుల ఏకశిల పతాక స్థూపాన్ని ఏర్పాటు చేయడం అద్భుతమని మంత్రి పేర్కొన్నారు. కూచిపూడి నాట్యానికి ఆదరణ పెంచేందుకు కళాకారులు కార్యాచరణతో ముందుకు వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో చర్చిద్దామని ఆయన సూచించారు. కూచిపూడి నాట్యం అనే దీపాన్ని దేదీప్యమానంగా వెలుగొందేలా అందరూ చేయిచేయి కలిపి కృషి చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు.

ప్రతి గ్రామంలో కళాక్షేత్రం ఉండాలి: మంత్రి కొల్లు రవీంద్ర

ప్రతి గ్రామంలో కూచిపూడి కళాక్షేత్రం ఉండాలని, కూచిపూడి నాట్యకళపై మక్కువ పెంచుకునేలా పిల్లలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. కూచిపూడి కళాకారులకు ఉద్యోగాల్లో అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తదనంతో కూచిపూడిని ముందుకు తీసుకెళ్తానన్నారు. కూచిపూడి అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చిస్తానని మంత్రి రవీంద్ర హామీ ఇచ్చారు.

భాషను, సంస్కృతినీ అంతం చేసే ప్రభుత్వాన్ని చూశాం

» వైసీపీకి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు చురకలు

ఇంతకు ముందు భాషను, సంస్కృతిని అంతం చేసే ప్రభుత్వాన్ని చూశామని గత వైసీపీ ప్రభుత్వానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు చురకలు వేశారు. నేడు కళను ఆదరించే ప్రభుత్వం అధికారంలో ఉందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కూచిపూడి మరింత అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాట్య పతాక స్థూపం ఆవిష్కరించటం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. తెలుగువారి జీవనాడి కూచిపూడి అని, సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ నాట్యకళ నేటికీ సజీవంగా ఉండడం మంచి పరిణామమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఈ సంస్కృతిని నిలబెడుతూ భావితరాలకు అందిస్తున్న కళాకారులు అభినందనీయులన్నారు. అంతకు ముందు శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ గ్యాలరీని మంత్రులు తిలకించారు. కళాపీఠం ఆవరణలో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కళాపీఠం సమీపంలో ఏర్పాటు చేసిన నాట్య పతాక స్థూపాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆవిష్కరించారు.



ఫొటో ఎగ్జిబిషన్ గ్యాలరీని ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



మాదిగల పారిశ్రామిక అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

» అందుకోసం కసి, పట్టుదలతో పనిచేయండి

» మాదిగలకు కేంద్ర మంత్రి 'పెమ్మసాని' పిలుపు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'మాదిగలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉద్యోగాలు చేయడమే కాదు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి. అందుకు ఎవరైతే సామాజికంగా, ఆర్థికంగా తక్కువగా చూశారో కసితో వారినే స్ఫూర్తిగా తీసుకోవాలి. పట్టుదల, లక్ష్యంతో పనిచేయాలి.' అని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. ఆదివారం హనుమాన్‌జంక్షన్‌లో ఇంటెలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్, ఇంటర్నేషనల్ మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో 7వ ప్రపంచ మాదిగ దినోత్సవం సందర్భంగా మాదిగల వ్యాపార పారిశ్రామిక రంగ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పెమ్మసాని మాట్లాడారు. మాదిగలు పారిశ్రామికంగా ఎదగడానికి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ద్వారా అనేక పథకాలను అమలు చేస్తున్నామని ఔత్సాహిక మాదిగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు సూచించారు. ఇంటర్నేషనల్ మాదిగ చాంబర్ అండ్ ట్రేడ్ ఇండస్ట్రీ సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కొలికిపూడి శ్రీనివాసరావు, బుర్ల రామాంజనేయులు, ఇంటిలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లా విద్యార్థి, ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం బాపిరాజు, ఐఎంసీటీఐ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రాజేంద్రప్రసాద్, ఫోరం కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు బీఆర్ మునిరాజ్, బెంగుళూరు రిటైర్డు జడ్జి కినికేరి మల్లికార్జుడి పాల్గొన్నారు.

గుణదల ఉత్సవాలకు ప్రభుత్వ సహకారం

» ఎంపీ కేశినేని చిన్ని



ఎంపీ కేశినేని చిన్నికి ఆశీర్వాద ప్రార్థన చేస్తున్న మేరీమాత పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు

గుణదల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో నిర్వహించే మేరీమాత ఉత్సవాలకు ప్రభుత్వ సహకారం ఉంటుందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై చర్చ్ కౌన్సిల్ సభ్యులతో ఆదివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. పలు సమస్యలు కౌన్సిల్ సభ్యులు తన దృష్టికి తీసుకొచ్చారని వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. అభివృద్ధి పనులపై ప్రభుత్వ సహకారం కావాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. మేరీమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు ప్రత్యేక ప్రార్థన చేసి ఎంపీని ఆశీర్వదించారు. గుణదల చర్చి అధ్యక్షుడు నువ్వుల విజయబాబు, ఉపాధ్యక్షుడు చెరుకూరి జోసఫ్, కోశాధికారి గోలి విజయానంద్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నలుగురు అరెస్టు

» పోక్సో కేసు నమోదు: డీఎస్పీ అబ్దుల్ సుభాన్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో బాలిక(13)పై అత్యాచారానికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఆదివారం ఇనకుదురు పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ సుభాన్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. 'రోడ్డుపై ఉన్న బాలికను చంపేస్తామని బెదిరించి కాసానిగూడెం పావురాలగూడు సెంటర్ నుంచి మహమ్మద్ సలేహా(21), సాదం బాలశంకరసాయి(19) బలవంతంగా నోరుమూసి బైక్‌పై మధ్యలో కూర్చోబెట్టుకుని పంపులచెరువు వెనుక వాటర్ హౌస్ వద్ద ఖాళీ ప్రదేశానికి తీసుకొచ్చారు. అక్కడ ఉన్న వారి స్నేహితులు రామాని అశోక్(19), వేముల వెంకట పవన్(20)తో కలిసి నలుగురూ ఆ బాలికను చేతులతో చెంపలపై కొడుతూ శరీరంపై తాకకూడని ప్రదేశాల్లో తాకారు. ఒకరి తరువాత ఒకరు ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశారు. దీంతో బాలిక కేకలు పెడుతూ పారిపోయింది. ఇంటికి వచ్చి తల్లికి చెప్పగా, తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.' అని డీఎస్పీ తెలిపారు. దర్యాప్తు చేసి నలుగురిని అరెస్టు చేసి, గ్యాంగ్‌రేప్, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపామన్నారు. కాలేఖాన్‌పేట చెక్‌పోస్టు వద్ద నిందితులను అరెస్టు చేశామన్నారు.

బాలిక సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే: మంత్రి రవీంద్ర

బాలిక సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని తల్లిదండ్రులకు మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను ఆదివారం ఆయన పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలతతో మాట్లాడారు.

విజేతల స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు చేరండి

» చెస్ క్రీడాకారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



చదరంగం పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు గడ్డపై నుంచి ఎందరో చెస్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్టేట్ ర్యాంకింగ్ చదరంగం పోటీలకు కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన 60 మంది విజేతలకు కలెక్టర్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

ఘంటసాల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మన ఊరు - మన సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎన్ఆర్ఐ గొర్రెపాటి నవనీతకృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో జనవరి 13, 14 తేదీల్లో ఘంటసాలలో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల పూటీ లాగుడు బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకుడు బండి పరాత్పరరావు తెలిపారు. 13న 200 కేజీల న్యూ జూనియర్స్ విభాగం, 14న 250 కేజీల జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు. ఒంగోలు జాతి ఆవుల అందాల పోటీలు నిర్వహిస్తామన్నారు. న్యూ జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి రూ.30వేలు, రెండోది రూ.25 వేలు, మూడోది రూ.20 వేలు, నాలుగోది రూ.15 వేలు, ఐదోది రూ.10 వేలు, ఆరోది రూ.5 వేలు, జూనియర్స్ సీనియర్స్ విభాగంలో మొదటిబహుమతి రూ.50 వేలు, రెండోది రూ.40 వేలు, మూడోది రూ.30 వేలు, నాలుగోది రూ.20వేలు, ఐదోది రూ.10 వేలు, ఆరోది రూ.5 వేలు, ఎంట్రీ ఫీజు రూ.1000 అని తెలిపారు. వేమూరి రాజేంద్రప్రసాద్ 9912430945, బండి పరాత్పరరావు 8919155334, కన్నెగంటి లక్ష్మీనారాయణ 9949319062, రాధాకృష్ణప్రసాద్ 9490920887ను సంప్రదించాలన్నారు.

విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలి

» ప్రపంచ తెలుగు రచయితల మహాసభల భాషోద్యమ సదస్సులో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎన్.ముక్తేశ్వరరావు



మహాసభలో చేసిన తీర్మానాల ప్రతిని మంత్రి కందుల దుర్గేశ్‌కు అందిస్తున్న ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యదర్శి జీవీ పూర్ణచందు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రంలో మాతృభాషను తొలగించి ఇంగ్లీష్ మీడియంలో బోధనా పద్ధతులు ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యం దృష్ట్యా నేరమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎన్.ముక్తేశ్వరరావు అన్నారు. ఆవంత్స సోమసుందర సభా వేదికపై నిర్వహించిన భాషోద్యమ సదస్సులో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. పిల్లలకు విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలన్నారు. రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియంలో విద్యను బోధించే విధానాన్ని ప్రభుత్వం బేషరతుగా రద్దు చేయాలన్నారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు గారపాటి ఉమామహేశ్వరరావు, మండల వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకుడు మునిరత్నం నాయుడు, హైదరాబాద్‌కు చెందిన రచయిత సగిలి సుధారాణి, గుంటూరు చెందిన డాక్టర్ బడికల్లు జమదగ్ని, అమ్మనుడి సంపాదకుడు డాక్టర్ సామల రమేశ్ బాబు మాట్లాడారు. తమ సంస్థ నుంచి బాలల పోటీలు నిర్వహిస్తూ 1.10 లక్షల పుస్తకాలు పంపిణీ చేశామని గంగవరానికి చెందిన పైనేని తులసీనాథం నాయుడు ఈ సదస్సులో తెలిపారు.

కవులు, భాషావేత్తల స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయాలి

» ముగింపు సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

'రాష్ట్రంలో తెలుగు భాష కోసం పనిచేసిన కవులు, భాషావేత్తల స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయాలి. వైసీపీ ప్రభుత్వం కళాకారులకు రూ.5కోట్లు బకాయిలు పెట్టింది. వాటిని విడుదల చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కళాకారులకు ఇచ్చే పెన్షన్‌ను పెంచాలి. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలి.' అని ముగింపు సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. నన్నయ 11వ శతాబ్దంలో తెలుగులోకి భారతాన్ని అనువదించేటప్పుడు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నాడో అదే పరిస్థితి ఇప్పుడు ఉందని, పదసంపద సృష్టికి తగినంత కృషి జరగాలని సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకుడు విజయభాస్కర్ అన్నారు. పూర్వం గ్రామాల్లో ప్రదర్శించిన నాటకాల్లో ప్రయోగించిన పద్యాలు నేటికీ ప్రజల నాలుకలపై ఆడుతున్నాయని, ఇప్పుడు సామాజిక ఇతివృత్తంతో పద్య నాటకాలను తీసుకొస్తే భాష సజీవంగా నిలుస్తుందని నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ పేర్కొన్నారు. ముగింపు సభలో కొలకలూరి ఇనాక్, అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు, సిలికానాంధ్ర ప్రతినిధి చామర్తి రాజు, ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి జీవీ పూర్ణచందు తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్య లేమి తొలగాలి

» బాలసాహిత్య ప్రతినిధుల సదస్సులో రచయిత దాసరి వెంకటరమణ

'ఉమ్మడి కుటుంబాలు, బాలసాహిత్య పత్రికలు లేకపోవడం వల్లే బాలలు నైతిక విలువలకు దూరమవుతున్నారు. బాల సాహిత్యం మాతృభాష సంపదను పిల్లలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. బాల సాహిత్య లేమి తొలగాలి.' అని హైదరాబాద్‌కు చెందిన రచయిత దాసరి వెంకటరమణ ఆకాంక్షించారు. తెలుగు రచయితల మహాసభల్లో బాలబంధు బీవీ నరసింహారావు సభా వేదికపై నిర్వహించిన బాలసాహిత్య ప్రతినిధుల సదస్సులో ఆయన మాట్లాడారు. చిత్రకారుడు తిప్పాని వెంకటరావు, హైదరాబాద్‌కు చెందిన చెంగల్వ కామేశ్వరి, నెల్లూరుకు చెందిన గంగిశెట్టి శివకుమార్, గోవిందరాజు సుభద్రనాయుడు, సాలూరుకు చెందిన కిలపర్తి దాలినాయుడు తదితరులు పేర్కొన్నారు. బాలబాట బాలసాహిత్యపు పత్రిక సంపాదకులు కేవీఎస్వీ రమణమ్మ పాల్గొన్నారు.

డాక్టరేట్లు అమ్ముకుంటున్నారు

» పరిశోధనారంగ ప్రతినిధుల సదస్సులో వక్తలు

విజయవాడ కల్చరల్: తెలుగు రచయితల మహాసభల్లో కావలి బొర్రయ్య వేదికపై పరిశోధనా రంగ ప్రతినిధుల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత చరిత్ర ఉపన్యాసకుడు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడారు. 'మాతృభాషకు తగిన గుర్తింపు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఈ తరుణంలో పరిశోధనా రంగానికి సంబంధించిన డాక్టరేట్లు అమ్ముతున్నారు. గౌరవ డాక్టరేట్ ఇచ్చినందుకు రేట్ కడుతున్నారు. అందుకే అది డాక్టరేటు అయింది. వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పరిశోధన పదోన్నతి కాదు.. భవితకు మార్గదర్శకం చేసే వెలుగు బాటకావాలి.' అని సవరం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

శోధనే మిగిలింది

భవానీపురం: తెలుగు పరిశోధనల్లో స్థాయి దిగజారడంతో పరిశోధనలో శోధనే మిగిలిందని, మూలాలు మర్చిపోయి తెలుగు పునర్జీవం రావాలంటే అది సాధ్యం కాదని రచయితలు అభిప్రాయపడ్డారు. పరిశోధనా రంగ ప్రతినిధుల సదస్సులో ఆత్మీయ అతిథిగా విచ్చేసిన మన్నవ సత్యనారాయణ(దుగ్గిరాల) మాట్లాడారు. ఒకప్పుడు పరిశోధనలకు అవకాశాలు చాలా తక్కువగా ఉండేవన్నారు. ఇప్పుడు సాంకేతిక అందుబాటులోకి వచ్చినా పరిశోధనా స్థాయి పెరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత డాక్టర్ ప్రబల జానకి(న్యూఢిల్లీ), రామన్నపేటకు చెందిన కృష్ణ కౌండిన్య, నంద్యాలకు చెందిన డాక్టర్ సి.గురుప్రసాద్, మచిలీపట్నానికి చెందిన డాక్టర్ గురజాడ రాజేశ్వరి, చలపాక ప్రకాష్, సీహెచ్‌వీఎస్ఎస్ శర్మ పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు జట్లను తీసుకెళ్లేందుకు నిధులివ్వండి

» సీఎం చంద్రబాబుకు ఏపీవోఏ అధ్యక్షుడు పురుషోత్తం అభ్యర్థన

విజయవాడ స్పోర్ట్స్/ధర్నాచౌక్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జనవరి 28 నుంచి నిర్వహించే జాతీయ క్రీడల్లో రాష్ట్రానికి చెందిన క్రీడా జట్లను తీసుకెళ్లేందుకు రూ.31.50 లక్షలు అవసరమని, నిధులను చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసి ఆర్థికంగా భరోసా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం అభ్యర్థించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడల ప్రారంభానికి 26 రోజులే ఉన్నా ఇంకా శాప్, ప్రభుత్వం ఆర్థిక సాయం ఊసెత్తడం లేదన్నారు. సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలన్నారు. చంద్రబాబు దగ్గరకెళ్లి నిధులు అడిగే అవసరం తమకు లేదన్నారు. తమవెంట వచ్చే 17 క్రీడా సంఘాల ఆధ్వర్యంలో జట్లను తాము తీసుకెళ్తున్నామని, డీ చెఫ్ మిషన్‌గా బడేటి వెంకట్రామయ్య, డిప్యూటీ డి చెఫ్ మిషన్‌గా రామిరెడ్డిలను నియమించామన్నారు. జనవరి 3లోగా జట్ల వివరాలను అధికారికంగా క్రీడల పోర్టర్‌లో నమోదు చేయాలని, ఈలోగా అథ్లెటిక్స్, ఆర్చరీ, ఖోఖో, రోయింగ్ క్రీడలకు ఆయా సంఘాలు కలిసి వస్తే తీసుకెళ్తామని, లేకపోతే వారిని కలిసి తీసుకెళ్లేది లేదన్నారు. రాష్ట్రంలో క్రీడలను బతికించాలని సీఎంకు మొరపెట్టుకుంటున్నామన్నారు.

జాతీయ క్రీడలకు జట్లను ప్రభుత్వమే తీసుకెళుతుంది

» నిధుల కోసం ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయడం సిగ్గుచేటు

» అధ్యక్షుడిగా పురుషోత్తమ్‌కు గుర్తింపులేదు: ఏపీవోఏ సెక్రటరీ కేపీ రావు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ జట్లను తీసుకెళ్లాలని ప్రభుత్వాన్ని కోరామని, కొద్దిరోజుల్లో శాప్‌కు తగు ఉత్తర్వులు వస్తాయని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ 175/1961 కార్యదర్శి కేపీ రావు వెల్లడించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో విలేకరుల సమావేశంలో కేపీ రావు ఆదివారం మాట్లాడారు. జాతీయ క్రీడలప్పుడే ప్రత్యక్షమై తానే ఏపీవోఏ అధ్యక్షుడినంటూ పురుషోత్తం నిధుల కోసం ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయడం సిగ్గుచేటన్నారు. ఆయనకు ఐవోఏ వెబ్‌సైట్‌లోనే గుర్తింపు లేదని, అధ్యక్షుడిగా గుర్తించలేదని, ఇప్పటికీ మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పేరే ఉందని తెలిపారు. పురుషోత్తం చెన్నైవాసి అని, క్రీడాజట్లను తీసుకెళ్లే అర్హత లేదని తెలిపారు. గుజరాత్, గోవాల్లో జరిగిన జాతీయ క్రీడలకు నేరుగా ప్రభుత్వమే టీఏ,డీఏలు ఇతర ఖర్చుల కింద నిధులను క్రీడా సంఘాలు, క్రీడాకారుల ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. అవినీతి అలవాటుపడిన పురుషోత్తం ఐవోఏ రూల్స్‌కు వ్యతిరేకంగా వెళుతున్నాడని, చట్టపరంగా ఆయనను అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వం సమకూర్చే డబ్బులతో ఇబ్బంది లేకుండా క్రీడాజట్లను జాతీయ క్రీడలకు తీసుకుని వెళతారని అన్నారు. పురుషోత్తం మాటలకు ప్రజాప్రతినిధులు స్పందించ వద్దన్నారు. ఆయన ఏపీవోఏలోకి ప్రవేశించాకే క్రీడారంగం భ్రష్టు పట్టిందని కేపీ రావు ఆరోపించారు.

బీజేపీ ఫాసిస్ట్ విధానాలను తిప్పికొట్టాలి

» వామపక్ష నేతల పిలుపు

ధర్నాచౌక్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హిందూ రాజ్యమే బీజేపీ లక్ష్యమని, మనువాద బీజేపీని తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. 'ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-మనువాద ఫాసిస్ట్ కార్పొరేట్ శక్తుల ప్రమాదం-కమ్యూనిస్ట్-వామపక్ష సామాజిక శక్తుల కర్తవ్యం' అనే అంశంపై ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దాసరిభవన్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్ట్ విధానాన్ని అమలు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌పై హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని రాజ్యాంగంపై దాడిగా భావించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాటం నాగభూషణం అన్నారు. అదానీ కోసం పేదలపై కరెంట్ చార్జీల భారాన్ని వేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత పోలారి, ఎస్‌యూసీఐ(సీ) నేత సుధీర్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నేత ఎస్కే. గౌస్ పాల్గొన్నారు.



పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎన్జీవో సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్

పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ సంఘ ఎన్నిక ఏకగ్రీవం

ధర్నాచౌక్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్(వర్క్ అకౌంట్స్) ఎంప్లాయిస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర సంఘం ఎన్నికల్లో 15 మంది రాష్ట్ర కార్యవర్గసభ్యులతో కూడిన ఆర్.ఎస్.హరినాథ్ బాబు, రమణారెడ్డి ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్జీవో సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ ప్రకటించారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా విద్యాసాగర్ వ్యవహరించారు. 15 పదవులకు హరినాథ్ ప్యానల్‌కు చెందిన సభ్యులు నామినేషన్ దాఖలు చేయడం వల్ల ఎన్నిక ఏకగ్రీవం అయిందని ఆయన ప్రకటించారు. ఎన్నికైన సభ్యులతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. సహాయ ఎన్నికల అధికారిగా డి.సత్యనారాయణరెడ్డి, పరిశీలకుడిగా టి.గోపాలకృష్ణ వ్యవహరించారు. తొలుత నిర్వహించిన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్సీ, మాజీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌బాబు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి, కృష్ణానదిలో పవిత్రస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా అయ్యేందుకు ఈవో రామారావు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు.



కిటకిటలాడుతున్న క్యూలైన్లు



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

రేషన్ డీలర్ల పోస్టులకు పరీక్షలు

ఉయ్యూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగాఉన్న రేషన్ షాపు డీలర్ల భర్తీకి స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆదివారం రాత పరీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధి 7 మండలాలైన ఉయ్యూరు, పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వలో మమారు 46 పోస్టులు ఖాళీకాగా వాటి భర్తీకి రాతపరీక్ష నిర్వహించగా 67 మంది పరీక్షకు హాజరయ్యారు.



పరీక్షకు హాజరైన దరఖాస్తుదారులు

హామీలన్నీ నెరవేరుస్తాం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్

పెనమలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు పోతున్నామని, ఈ క్రమంలో ఇంకా మిగిలిన హామీలను త్వరలోనే పూర్తిచేస్తామని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తాడిగడప మునిసిపాలిటీలోని కానూరు శ్రీరామ్‌నగర్ కాలనీలో 61.50లక్షలతో నిర్మించిన సబ్‌స్టేషన్ రోడ్డు, ఎనభై లక్షల వ్యయంతో నిర్మించిన మనకళ్యాణ మండపం సమీపంలోని రోడ్డును, ఎన్టీఆర్ సెంటరు వద్ద నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. అనంతరం విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, పెనమలూరు నియోజకవర్గంలో షుమారు 60 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని, కేవలం తాడిగడప మునిసిపాలిటీలోనే అభివృద్ధి పనులకు 15కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇటీవల కానూరు ప్రధాన రహదారి వర్షాలకు మునిగిపోతే రాత్రికిరాత్రి మరమ్మతులు చేపట్టి రోడ్డును పూర్తి చేశామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కానూరు పరిధిలోని సిద్ధార్థ కళాశాల పైవంతెనను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని, ఇది కూటమి ప్రభు త్వ అభివృద్ధిగా అభివర్ణించారు. అప్పట్లో పంటకాల్వ రోడ్డు నిర్మాణానికి ఎన్నో అవాంతరాలు వచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో కళాశాల యాజమాన్యాన్ని ఒప్పించి రోడ్డును పూర్తి చేశామని గుర్తుచేశారు. త్వరలోనే సిద్ధార్థ కళాశాల నుంచి గంగూరు చేపలకుండీల వరకు పంటకాల్వ రోడ్డును పూర్తి చేస్తామని తెలిపారు.

భూగర్భజలాలు కలుషితం కాకుండా ప్రక్కనే ఉన్న కృష్ణానది నీటిని జిల్లా వ్యాప్తంగా ఉపయోగించే విధంగా ఎంపీ బాలశౌరి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అందరూ ఐకమత్యంతో ఉండి మన ప్రాంతాన్ని, మన గ్రామాలను అభివృద్ధి చేసుకొందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, చలసాని హిమకిరణ్, జనసేన నాయకులు ముప్పా రాజా, తాతపూడి గణేష్, మొక్కపాటి శ్రీనివాస్, విగ్రహ కమిటీ సభ్యులు వరుణ్, సతీష్, ప్రవీణ్, చైతన్య ఏఆర్‌కే చౌదరి, చందు పాల్గొన్నారు.



జంక్షన్‌లో జరిగిన ప్రపంచ మాదిగ పారిశ్రామిక సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

మాదిగ యువత పారిశ్రామికంగా ఎదగడానికి సహకరిస్తాం

- మంచి డీపీఆర్‌తో వస్తే మల్లవల్లి పారిశ్రామిక వాడలో అవకాశం
- ఇంటర్నేషనల్ మాదిగ పారిశ్రామిక సదస్సులో ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్ / రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శాయశక్తుల కృషి చేస్తున్నారని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అందరికి అవకాశం ఇవ్వడం జరుగుతుందని, మాదిగ యువతీ, యువకులు మంచి ప్రాజెక్టుతో ముందు వస్తే మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం హనుమాన్‌జంక్షన్‌లో ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్, ఇంటర్నేషనల్ మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో 7వ ప్రపంచ మాదిగ దినోత్సవం సందర్భంగా మాదిగల వ్యాపార పారిశ్రామిక రంగ అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటిలెక్చువల్ మాదిగ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్టా విద్యార్థి అధ్యక్షతన జరిగిన సదస్సులో తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు, ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం బాపిరాజు, ఐఎంసీటీఐ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రాజేంద్రప్రసాద్, జనసేన నియోజకవర్గం సమన్వయ కర్తచలమలశెట్టి రమేష్‌బాబు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా వరసాయి ప్రసాద్ పాల్గొన్నారు.



కోలాటం నృత్య ప్రదర్శనిస్తున్న చిన్నారులు

వైభవంగా బాలోత్సవం

అలరించిన జానపద నృత్య ప్రదర్శనలు

ప్రసాదంపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యూటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ బాలోత్సవం రెండు రోజుల వేడుకల్లో భాగంగా ఆదివారం జానపద గీతాలు, జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయాలు, కోలాటం వంటి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అకడమిక్ విన్నర్‌గా రుషి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రన్నర్‌గా ఫ్యూచర్ పాత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కల్చరల్ విన్నర్‌గా శ్రీసాయి కళ్యాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రన్నర్‌గా స్రవంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ గెలుపొందాయి. ఆయా స్కూల్స్ ప్రతినిధులకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులుగా వీ.జీ.ఎస్ పబ్లిషర్స్ అధినేత సూర్యనారాయణ, వీ.ఆర్.కె బుక్ లింక్స్ అధినేత రామకృష్ణ, మోడరన్ అకాడమి అధినేత పి. వినయ్ రంజన్, అసోసియేషన్ అధ్యక్షులు దేవినేని కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని కృష్ణాజిల్లా కార్యదర్శి వెలమర్తి రవిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లాలో యూటీఎఫ్ ప్రచారయాత్ర సోమవారం ఉదయం బాపులపాడు చేరుతున్నందున ప్రతి ఒక్కరూ స్వాగతం పలికి పాల్గొనాలని కోరారు. ప్రచారయాత్ర సందర్భంగా బాపులపాడులోని సీఐటీయూ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ జరుగుతుందని అభిమానులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.



బహుమతులు అందుకున్న విజేతలు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ఉయ్యూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. స్థానిక వడ్డే శోభనాద్రి బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో ఉయ్యూరు, పరిసర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొనగా విజేతలకు ఏజీ అండ్ ఎస్‌జీ ఎస్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ దండమూడి బాలకృష్ణ బహుమతులు అందజేశారు.

కొనసాగుతున్న ధనుర్మాస మహోత్సవాలు

గన్నవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారిని పలు రకాల పరిమళ భరిత పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు రామాచార్యులు విశేషపూజలు జరిపారు. జనవరి 2న గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ ఉంటుందన్నారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొనాలని కోరారు.



సర్పంచి శ్రీనివాసచౌదరికి ఫ్రీజరును అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పెదపులిపాక పంచాయతీకి ఫ్రీజర్ అందజేత

పెనమలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెదపులిపాకకు చెందిన పోలవరపు బోసుబాబు, లక్ష్మీసామ్రాజ్యంల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు పెదపులిపాక గ్రామ పంచాయతీకి ఎనభైవేల విలువైన వీఐపీ ఫ్రీజర్‌ను ఆదివారం అందించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా కుటుంబసభ్యులు గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరికి ఫ్రీజర్‌ను అందించారు. కార్యక్రమంలో గుమ్మడి రవికృష్ణ, సునీత, సజ్జా ప్రియ, వాసిరెడ్డి లేఖ, మునునూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఉయ్యూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణస్వీకారం చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా అబ్దుల్ సత్తార్, కార్యదర్శిగా వేమూరి పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులుగా బెజ్జంకి బ్రహ్మేశ్వరరావు, ముప్పా శివరామకృష్ణ, పూర కిషోర్, సహాయ కార్యదర్శిగా తుమ్మల హిమకరబాబు, సంయుక్త కార్యదర్శిగా గండు భానుప్రకాశ్, కోశాధికారిగా గుండా తులసీరామ్, 11మంది గౌరవ సలహాదారులు, మరో 28 మంది కార్యవర్గ సభ్యులతో గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

కేసీపీ రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనం

ఉయ్యూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓ సంస్థలో కలసి మెలసి పనిచేసి రిటైర్ అయ్యాక ఎక్కడెక్కడో నివసిస్తూ కలుసుకుని కష్టసుఖాలు పంచుకోవడం సంతోషకరమని, కేసీపీ మాజీ వైద్య అధికారి, సీనియర్ వైద్యుడు శివరామకృష్ణయ్య అన్నారు. కేసీపీలో వివిధ హోదాల్లో ఉద్యోగాలుచేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఆదివారం ఉయ్యూరులో కలుసుకుని కష్టసుఖాలు తెలుపు కుంటూ సంతోషంగా గడిపారు. 75 ఏళ్లు నిండిన వారిని ఘనంగా సత్కరించారు. కోటేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న డాక్టర్ శివరామకృష్ణయ్య



పాతపాడులో అక్రమంగా తవ్వుతున్న పోలవరం కాల్వ మట్టి

అక్రమంగా మట్టి తరలింపు

పోలవరం కాల్వ మట్టి అర్ధరాత్రులు తరలిస్తున్న అక్రమార్కులు

వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ పాత పాడులోని పోలవరం కాలువ మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. అడ్డుకున్న వారిని అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్నారు. ఈ అక్రమ తరలింపుపై సంబంధింత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టిం చుకోవటం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. నున్న-పాతపాడు మధ్య పోలవరం కాలువ గట్టుపై దిబ్బలుగా ఉన్న మట్టిని పాతపాడు, కండ్రిక ప్రాంతానికి చెందిన వ్యక్తులు నాలుగు రోజుల నుంచి అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా పోలవరం కాలువ గట్టు నుంచి నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్ మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నాలుగు రోజులలో సుమారు 250 నుంచి 300 టిప్పర్ల మట్టిని అక్రమంగా తరలించినట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా, ఇటీవల పాతపాడుకు చెందిన పలువురు అధికార పార్టీకి చెందిన నాయకు లు పోల వరం కాలువ గట్టు మట్టిని తరలిస్తుండగా స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సూచనల మేరకు సంబంధిత పోలీసు అధికారులు రెండు టిప్పర్లు, రెండు ప్రొక్లెయిన్ లను సీజ్ చేశారు. టిప్పర్లను పోలీసు స్టేషన్‌కు తరలించగా, ప్రొక్లెయిన్‌లను పోలవరం కాలువపైనే వదిలేశారు. ఈ క్రమంలో సీజ్ చేసిన ప్రొక్లెయిన్‌తోనే మట్టిని తవ్వి, అక్రమార్కులు గత నాలుగు రోజుల నుంచి అర్ధరాత్రులు భారీగా మట్టి తరలిస్తున్నారు.



యనమలకుదురు డొంక రోడ్డులో సీపీఎం నిరసన ప్రదర్శన

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం నిరసన

పెనమలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీల పెంపుపై సీపీఎం ఆధ్వర్యంలో యనమలకుదురు డొంకరోడ్డులో ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. పెంచిన విద్యుత్ చార్జీల వల్ల ప్రజలపై పదహారు వేల కోట్ల అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, పెంచిన చార్జీలను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాసిం, షేక్ మస్తాన్‌వలి, షేక్‌బాబు, వలీబీ, పల్లా చిన్నపాపారావు, కామ్రేడ్ సత్యం, పాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో తొలగించిన ఆరోగ్య సహాయకులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ..వేడుకోలు... కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పారా మెడికల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కన్వీనర్ జీ.వీ.వీ ప్రసాద్ తెలిపారు. తమకు జరిగిన అన్యాయం గురించి తెలియజేస్తూ అమరావతిలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని ఆదివారం కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. ఉద్యోగాల తొలగింపుపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశామని, మంత్రులకే పరిమితమైన వేడుకోలును ఇక నుంచి ప్రధాన నేతలకు కూడా కలిసి వివరించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మండల నేత నాగరాజు, పండు పాల్గొన్నారు.



విజేతలతో సిప్ అబాకస్ యాజమాన్యం

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి సిప్ అబాకస్ పోటీలు

పటమట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సిప్ అబాకస్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సిప్ అబాకస్ అర్థమెటిక్ జీనియస్ పోటీలు ఆదివారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఉత్సాహభరి తంగా సాగాయి. ఈ పోటీకు రాష్ట్రవ్యాప్తంగా 30 స్కూల్స్ నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్టేట్ హెడ్ మాకినేని గోపాలకృష్ణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి తాము ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణితంపై ఆసక్తి, జిజ్ఞాస పెంచే లక్ష్యంగా సిప్ అకాడమీ అబాకస్‌పై శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.



పోరంకి కార్మికనగర్ కట్ట వద్ద ఐద్వా నిరసన

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

పెనమలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిదేళ్ల చిన్నారిపై పాశవికంగా అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఐద్వా మహిళా సంఘం ఆదివారం డిమాండ్ చేసింది. పోరంకి కార్మికనగర్ కట్ట వద్ద ఆదివారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఐద్వా మహిళాసంఘ కార్యకర్తలు పాల్గొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పుసులూరి పాతాళ లక్ష్మి మాట్లాడుతూ, మహిళలపై అత్యాచారాలు నిత్యకృత్యమయ్యాయని, ఇలాంటి వారిని కఠినంగా శిక్షించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ త్రిమూర్తులు, పుసులూరి లక్ష్మీనారాయణ, విసం సోమశేఖర్, రాంబాబు, లావణ్య, దాసరి రమణమ్మ, ఉప్పాబ ఈశ్వరి, ముద్రబోయిన దుర్గ, గంగ, మారోజు రమ, మండూరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సిద్ధార్థ అకాడమి కోశాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రమేశ్

విలువలతో కూడిన విద్యనందించటం

సిద్ధార్థ అకాడమికే సాధ్యం

గన్నవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విలువలతో కూడిన విద్యనందించటం సిద్ధార్థ అకాడమికే సాధ్యమని డాక్టర్ కొడాలి జె.రమేష్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల వార్షికోత్సవం వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత 50 ఏళ్ల నుంచి అనేక విద్య సంస్థలను స్థాపించి విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేయటం గొప్ప విషయమన్నారు. ఎల్‌కేజీ నుంచి మెడిసిన్ వరకు విద్యనందించి సమాజానికి ఎంతో విలువైన సంపదను అకాడమి అందిస్తుందన్నారు. దంత వైద్య విద్యార్థులకు ప్రపంచంలో మంచి ఆదరణ ఉందన్నారు. సేవా భావంతో రోగులకు సేవలందించాలని సూచించారు. సీని యర్‌లు జూనియర్‌లకు ఆదర్శంగా నిలవాలన్నారు. అకాడమి కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 50ఏళ్ల క్రితం నిస్వార్థంతో ప్రారంభమైన అకాడమి నేడు అంచెలంచెలుగా ఎదిగి వేలమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు కళాశాల ప్రగతిని వివరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కన్వీనర్ పాలడుగు నాగసాయి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఉయ్యూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు క్రీడలు, ఇతర అంశాలపట్ల ఆసక్తి పెంపొందించుకుని, మంచి నైపుణ్యం సాధించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి పేరు ప్రఖ్యాతులు గడించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగసుబ్రమణ్యం అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠ శాలల విద్యార్థులకు జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. రామకృష్ణ రిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన పోటీలకు పలు పాఠశాలల నుంచి 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల్లో చెస్ పట్ల ఆసక్తి పెరగడం మంచి పరిణామన్నారు. బొమ్మారెడ్డి సాంబశివారెడ్డి కుమార్తె, చెస్ స్టేట్ ప్లేయర్ జీఎస్ కీర్తి పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించగా రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్, సీకే వసంతరావు, సీహెచ్ టీ వెంకటేశ్వరరావు, అమీర్ మీర్జా విజేతలకు బహుమతులు అందజేశారు.



చెస్ విజేతలతో రోటరీక్లబ్ సభ్యులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

భీమేశ్వరస్వామి సేవలో చంద్రకాళీ ప్రసాద మాతాజీ

గుడివాడ, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న భీమేశ్వరస్వామి దేవస్థానంలో స్వామిని సత్సంగ సమావేశాలకు విచ్చేసిన కాళీ వన ఆశ్రమ పీఠాధిపతి పూజయోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీ ఆదివారం దర్శించుకున్నారు. పీఠాధిపతికి ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు ఆలయ మర్యాదలతో, పూర్ణ కుంభంతో వేదమంత్రోచ్ఛరలతో ఘన స్వాగతం పలికారు. ఈ



కార్యక్రమంలో వేదపండితులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



రుక్మిణీ కల్యాణం హరికథను గానం చేస్తున్న విజయలక్ష్మి

అలరించిన హరికథ

తోట్లవల్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం హరికథా నట సామ్రాట్ బ్రహ్మశ్రీ పొడుగు పాండురంగ దాసు 49వ వర్ధంతి వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాండురంగాదాసు చిత్రపటానికి పలువురు కళాకారులు నివాళులర్పించారు. హరికథా కళాకారిణి పి విజయలక్ష్మీ భాగవతారిణి రుక్మిణీ కల్యాణం హరికథను గానం చేసి అలరించారు. పాండురంగదాసు కీర్తి చరిత్రలో నిలిచిపోతుందని ఆమె అన్నారు.

అయ్యప్ప పడిపూజ

పెదపారుపూడి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వింజరంపాడు గ్రామంలో కొమ్మ లక్ష్మణస్వామి అయ్యప్ప దీక్ష మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 18వ పడి పూజ అయ్యప్ప భక్తులు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంతర్గత రహదారులకు మహర్దశ

కోడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర్గత రహదారులకు మహర్దశ వచ్చిందని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. జయపురం ఎస్సీ వాడలో సీసీ రోడ్డు నిర్మా ణ పనులను ప్రారంభించారు. గోగినేని సోమశేఖరరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, ఆరిగ బాలస్వామి పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అభినందనీయం

గుడివాడ, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అన్నపురెడ్డి గోపిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కీర్తిశేషులు అట్లూరి సత్యనారాయణ భాస్కర దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఐదుగురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5000లు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పేదమహిళ తాహిరున్నీసాకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5000లు అందజేశారు. అనంతరం భాషా ప్రవీణ్ పండిట్ ట్రైపింగ్ కవి, విమర్శకులు వంగిపురపు వీరరాఘవాచారి, ఎవ్ఎబి రెడ్డి బాగ్యవతిలను ఘనంగా సత్కరించారు. ఉమ్మడి జిల్లా నియంత్రణ కమిటీ ఛైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గుత్తా రమేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ లంకదాసరి ప్రసాదరావు,ఛైర్మన్ వేణుగోపాలరావు, జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మీ, సీతారామస్వామి పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో కేకేఆర్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22వ తేదీన కాకినాడలోని ద్రోణ బ్యాడ్మింటన్ అకాడమీ, ఇంద్రపాలెంలో నిర్వహించిన ఇన్విటేషనల్ జాతీయ కరాటే పోటీల్లో స్థానిక డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. 14 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో బి.అఖిల్ కార్తికేయ, 11సంవత్సరాల లోపు విభాగంలో బి.జోగేంద్ర సురేష్‌లు బంగారు పతకాలు గెలుచుకున్నట్టు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి. ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



చిట్టిగూడూరు బస్టాప్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

గూడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మం డలం చిట్టి గూడూరు గ్రామ బస్టాప్ వ్ద ఈనెల 27వ తేదీ రాత్రి సుమారు 50 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.

సిమెంటు రంగు ప్యాంట్, ఆలివ్‌గ్రీన్ టి షర్ట్ ధరించి ఉన్నాడు. అను మానాస్పద మృతిగా గూడూరు ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9440796421 ఫోన్ నెంబ రుకు ఫోన్ చేసి తెలియజేయా ల్సిందిగా కోరారు.

ఉపసభాపతి, మంత్రులకు పామర్రులో ఘనస్వాగతం

పామర్రు, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నట్యపతాక స్వర్ణోత్సవాలకు వెళుతున్న శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణరాజు, కృష్ణాజిల్లా ఇన్‌చార్జిమంత్రివర్యులు కందులదుర్గేష్‌లకు పామర్రు ఎన్టీఆర్ సర్కిల్‌లో ఘన స్వాగతం లభించింది.

పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, జనసేన ఇన్‌చార్జితాడిశెట్టినరేష్ కూటమినేతలతో కలసి ఘనంగా స్వాగతం పలికారు. దుశ్శాలువా, పూల మాలతో సత్కరించారు.

కార్యక్రమంలో జిల్లా సాగునీటి ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, గొట్టిపాటి లక్ష్మీదాస్, తాడిశెట్టి మధు, ఎంపీటీసీ కూనపరెడ్డి సుబ్బారావు, జన్ను శోభన్‌బాబు, దాలిపర్తిప్రసాద్, దగ్గుపాటి ఫణీంద్ర, తోటరమేష్, చాట్లపెద్ద రమేష్ పార్టీకార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



ఉపసభాపతికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

త్రిపురనేని అవయవ దానం

గుడ్లవల్లేరు, డిసెంబరు, 29 (ఆంధ్రజ్యోతి) :విశ్రాంత ఉపాధ్యాయులు త్రిపురనేని శేషగిరిరావు శనివారం రాత్రి వయోభారంచే మృతి చెందగా ఆయన దేహాన్ని , నేత్రాలను వేర్వేరుగా దానం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారికి అందజేశారు. దేహాన్ని చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు పరిశోధనల నిమిత్తం దానం చేశారు. కుమారుడు సుధాకర్ అవయవ దానాలను చేయడం ముదావహమని క్లబ్ సభ్యులు కొనియాడారు. శేషగిరిరావు పార్థీవ దేహానికి పూల



మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శశికళ, మాజీ లయన్స్ గవర్నర్ వైపిసి ప్రసాద్, అడుసుమిల్లి వీరబద్రరావు, చాపరాల బాలాజీ, గుమ్మడి రామకృష్ణ, పెంటపాటి చిట్టిబాబు, సూరపనేని పరంధామయ్య, పెంటపాటి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ మాదిగ దినోత్సవం

గుడివాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గుడ్‌మెన్‌పేటలోని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ప్రపంచ మాదిగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ మాదిగ జాతి ఔన్నత్యం, చరిత్ర ఆధారాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, అనుబంధ కులాల ఆచార వ్యవహారాలు, సమస్యలు, తదితర అంశాలపై మాట్లాడారు. ఎన్ని అవాంతరాలు ఎదురైన ఎస్సీ వర్గీకరణ అవుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణకు అంగీకరించాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపటి సైమన్, వేల్పుల నాగబాబు, అద్దంకి మాణిక్యాలరావు, గంధం సైమన్‌బాబు, కొడాలి బాలు, మామిళ్ల ఏలీషా, ఇంటూరి గజేంద్ర, పసలాది శేఖర్, చిలకా ఆంజనేయులు, అద్దంకి కమల్, బలసాని యోహాను, జుజ్జవరపు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులరిస్తున్న దళిత నేతలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రజలందరిపై అమ్మవారి దీవెనలుండాలి

గుడివాడ, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో కొండాలమ్మ చల్లనిదీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లో ఆయన స్వగృహంలో కొండాలమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. తొలుత ఎమ్మెల్యే వెనిగండ్లకు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఈవో ఆకుల కొండలరావు శేషవస్త్రాలతో సత్కరించి, అమ్మవారి లడ్డూ, ఫోటో ఫ్రేమ్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు శివసంతోష్‌శర్మ, దేవస్థాన ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదపట్నం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెదపట్నం గ్రామ పంచాయతీ కార్యదర్శి శివనాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు.

గూడూరు మండలం ముక్కొల్లు గ్రామ పంచాయతీ సెక్రటరీగా పనిచేసిన సమయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించాడని పలు ఆరోపణలు శివనాగేశ్వరరావుపై వచ్చాయి. శివనాగేశ్వరరావు అక్రమాలకు పాల్పడ్డాడని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అతడిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

గుడివాడ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయు ఏపీ రాష్ట్ర అధ్యక్షులు డా.డి.శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం గుడివాడ పార్క్ స్కూల్‌లో కృష్ణా జిల్లా డి-పీఆర్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డా.డి.శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిషన్‌ను ప్రకటించాలన్నారు. 30 శాతం ఐఆర్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయులకు రావాల్సిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జీవీఎస్.పెరుమాళ్ల సభకు అధ్యక్షత వహించారు. జిల్లా శాఖ అధ్యక్షులు సంఘ ప్రధాన కార్యదర్శి నున్న రాంబాబు, డీపీఆర్‌టీయు నాయకులు మత్తి వెంకటేశ్వరరావు, జి.పోతురాజు, డి.సత్యనారాయణ, బి.గోపయ్య, బి.పాండురంగారావు, పి.వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, తారక రామారావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్టీయూ నేత శ్రీను



కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు నేటి నుంచి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నుంచి జనవరి 26 వరకు నిర్వహించే పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఈ పరీక్షలకు 7908 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, వారిలో 1629 మంది యువతులు ఉన్నారన్నారు. 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. డబ్బు చెల్లిస్తే ఉద్యోగం ఇస్తామని నమ్మబలికే దళారులను నమ్మవద్దన్నారు. అభ్యర్థులు తమతో పాటు అడ్మిట్ కార్డు, సర్టిఫికెట్లు విధిగా తీసుకురావాలన్నారు. ఆదివార ట్రయల్ రన్ నిర్వహించారు. ధృవపత్రాల పరిశీలన కంప్యూ టరీకరణ ఏర్పాట్లను ఆయన పరిశబబుూఇంచ

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందని సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం నగర కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో టీడీపీ సభ్యత్వ నమోదులో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన హసీంబేగ్, పి.వి. ఫణికుమార్ లను గోపీచంద్ ఆదివారం ఆయన నివాసంలో సత్కరించారు. సయ్యద్ సిరారుద్దీన్, సుబ్బారావు, రవీంద్రనాథ్, అజయ్, ఇర్ఫాన్, రవికుమార్ పాల్గొన్నారు.

నాలుగు వేల మందికి అన్నసమారాధన

అవనిగడ్డ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నాలుగు వేల మంది భక్తులకు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయి పవన్ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి సామూహిక లింగాష్టక పారాయణ చేయించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, అన్నదాన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బందరు సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

● మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి కొల్లు రవీం ద్ర అన్నారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, కలెక్టర్ డికె బాలాజీ ఇతర అధికారులతో కలిసి మంత్రి రవీంద్ర మూడు స్తంబాల సెంటర్ సమీపంలోని డంపింగ్ యార్డు, కుమ్మరిగూడెంలోని ఖాళీ ప్రదేశం, పోతేపల్లి జ్యువెలరీ పార్కులను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మునిసిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన ఆర్ అండ్ బి అతిథిగృహంలో పాత్రికేయులతో మాట్లాడారు. నగరం కార్పొరేషన్‌గా ఏర్పడిన అనంతరం గత ప్రభుత్వ పాలకులు ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య నగరానికి విచ్చేసి పరిస్థితులను పరిశీలించడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలో ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించామన్నారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ, అక్టోబరు రెండో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో బాగంగా నగరానికి విచ్చేసిన సందర్భంలో డంపింగ్ యార్డును పరిశీలించారన్నారు. ఎంతో కాలంగా అక్కడ పేరుకుపోయిన చెత్తను తక్షణమే తరలించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రి నగరాన్ని సందర్శించే నాటికి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నగర సుందరీకరణకు అవసరమైన నిధులను సమీకరించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జోనల్ అధికారి జోత్స్న, రీజనల్ అధికారి శ్రీనివాసరావు, బందరు ఆర్డీవో స్వాతి, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ మధుసూదనరావు, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కుంచె నాని, గోపు సత్యనారాయణ, లంకె నారాయణప్రసాద్, మాదివాడ రాము పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు పరిస్థితిని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్యకు వివరిస్తున్న మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.550

పెదపట్నం పంచాయతీ కార్యదర్శి శివనాగేశ్వరరావు సస్పెన్షన్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెదపట్నం గ్రామ పంచాయతీ కార్యదర్శి శివనాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు మండలం ముక్కొల్లు గ్రామ పంచాయతీ సెక్రటరీగా పనిచేసిన సమయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించాడని పలు ఆరోపణలు శివనాగేశ్వరరావుపై వచ్చాయి. శివనాగేశ్వరరావు అక్రమాలకు పాల్పడ్డాడని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అతడిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు.

బందరు సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

• మంత్రి కొల్లు రవీంద్ర



డంపింగ్ యార్డు పరిస్థితిని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్యకు వివరిస్తున్న మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, కలెక్టర్ డికె బాలాజీ ఇతర అధికారులతో కలిసి మంత్రి రవీంద్ర మూడు స్తంబాల సెంటర్ సమీపంలోని డంపింగ్ యార్డు, కుమ్మరిగూడెంలోని ఖాళీ ప్రదేశం, పోతేపల్లి జ్యూవెలరీ పార్కులను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మునిసిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన ఆర్ అండ్ బి అతిథిగృహంలో పాత్రికేయులతో మాట్లాడారు. నగరం కార్పొరేషన్‌గా ఏర్పడిన అనంతరం గత ప్రభుత్వ పాలకులు ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య నగరానికి విచ్చేసి పరిస్థితులను పరిశీలించడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలో ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించామన్నారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ, అక్టోబరు రెండో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరానికి విచ్చేసిన సందర్భంలో డంపింగ్ యార్డును పరిశీలించారన్నారు. ఎంతో కాలంగా అక్కడ పేరుకుపోయిన చెత్తను తక్షణమే తరలించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రి నగరాన్ని సందర్శించే నాటికి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నగర సుందరీకరణకు అవసరమైన నిధులను సమీకరించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జోనల్ అధికారి జోత్స్న, రీజనల్ అధికారి శ్రీనివాసరావు, బందరు ఆర్డీవో స్వాతి, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ మధుసూదనరావు, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కుంచె నాని, గోపు సత్యనారాయణ, లంకె నారాయణప్రసాద్, మాదివాడ రాము పాల్గొన్నారు.



కంప్యూటర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు నేటి నుంచి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నుంచి జనవరి 26 వరకు నిర్వహించే పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఈ పరీక్షలకు 7908 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, వారిలో 1629 మంది యువతులు ఉన్నారన్నారు. 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. డబ్బు చెల్లిస్తే ఉద్యోగం ఇస్తామని నమ్మబలికే దళారులను నమ్మవద్దన్నారు. అభ్యర్థులు తమతో పాటు అడ్మిట్ కార్డు, సర్టిఫికెట్లు విధిగా తీసుకురావాలన్నారు. ఆదివార ట్రయల్ రన్ నిర్వహించారు. ధ్రువపత్రాల పరిశీలన కంప్యూటరీకరణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మొగిలేశ్వర గుప్తా

అగ్ని బాధితులకు సాయం

మోపిదేవి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోసూరువారిపాలెం శివారు గొల్లపాలెం గ్రామానికి చెందిన అగ్నిబాధిత దేవనబోయిన కోటేశ్వరరావు, వీరరాఘవులకు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా సాయమందించారు. నూతన వస్త్రాలు, బియ్యం, నిత్యావసర సరుకులతోపాటు ఆర్థికసాయమందించారు. విస్సంశెట్టి రాజాబాబు, కొలుసు ధర్మారావు, ఓలేటి మాధురి, నీలం సరస్వతీ, బాలసాని నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న నేతలు

అంతర్గత రహదారులకు మహర్దశ

కోడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అంతర్గత రహదారులకు మహర్దశ వచ్చిందని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. జయపురం ఎస్సీ వాడలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గోగినేని సోమశేఖరరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, ఆరిగ బాలస్వామి, మద్దాల జానకి రామయ్య, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హసీంబేగ్, పి.వి. ఫణికుమార్‌లను సత్కరిస్తున్న గోపీచంద్

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందని సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం నగర కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో టీడీపీ సభ్యత్వ నమోదులో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన హసీంబేగ్, పి.వి. ఫణికుమార్ లను గోపీచంద్ ఆదివారం ఆయన నివాసంలో సత్కరించారు. సయ్యద్ సిరారుద్దీన్, సుబ్బారావు, రవీంద్రనాథ్, అజయ్, ఇర్ఫాన్, రవికుమార్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు

మోదుమూడిలో జనవరి 7 నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మోదుమూడి గ్రామంలో జనవరి 7, 8, 9, 10 తేదీలలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ తెలిపారు. మోదుమూడి రామాలయంలో 7వ తేదీ మంగళవారం మొవ్వ రఘుశేఖర ప్రసాద్ మహాభారతంపై ఉపన్యాసం చెబుతారన్నారు. 8వ తేదీ బుధవారం మహాభారత ఉపన్యాసం. భజన, 9న భగవద్గీత ఉపన్యాసం, భజన, 10వ తేదీ శుక్రవారం సుహాసినిలచే సామూహిక కుంకుమార్చన జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. మండల ధర్మాచార్యులు గరికపాటి వీరాంజనేయులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి లింగం బసవ శంకరరావు, మొవ్వ రఘుశేఖర ప్రసాద్, కొండవీటి పూర్ణిమలతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న స్టార్ కళాశాల విద్యార్థులు

ప్రతి ఆదివారం సైకిల్ ర్యాలీ అభినందనీయం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులతో ప్రతి ఆదివారం సైకిల్ ర్యాలీ చేయించడం వ్యాయామంలో ఒక భాగం మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్టార్ స్కూల్, కళాశాల విద్యార్థులు పాఠశాల నుంచి గిలకలదిండి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు గిలకలదిండి ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించారు. బందరుకోటలోని కోదండ రామాలయంలో కొల్లు రవీంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్‌లను కలిశారు. విద్యార్థులను అభినందించారు. మచిలీపట్నం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, స్టార్ విద్యా సంస్థల డీన్ పి. శ్రీరామ్, ప్రధానోపాధ్యాయుడు స్వామి, ఆదిత్యలను మంత్రి అభినందించారు.

నాలుగు వేల మందికి అన్నసమారాధన

అవనిగడ్డ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నాలుగు వేల మంది భక్తులకు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయి పవన్ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి సామూహిక లింగాష్టక పారాయణ చేయించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, అన్నదాన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పెడన జడ్పీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెడన, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. స్థానికంగా ఉంటున్న, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తరలివచ్చి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని సందడి చేశారు. ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము పాఠశాలలో చదివినప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు బొమ్ము గోవర్ధనరావు, పేరిశెట్టి తేజోవతి, భానుమతి, బాజీ, బషీర్, రవీంద్రనాథ్‌ఠాగూర్‌లను ఘనంగా సన్మానించారు. గురువులు శిష్యులకు శుభాశీస్సులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అవనిగడ్డ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలో కొలువై ఉన్న శ్రీ అలివేలు మంగ రాజ్యలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామికి ధనుర్మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ధన్వంతరి ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తుల స్వామి వార్లను దర్శించుకున్నారు.



శ్రీకర రామానుజుల స్వామిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

పిల్లల్లోనూ ఆధ్యాత్మికతను పెంపొందించాలి

చల్లపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లోనూ ఆధ్యాత్మికతను పెంపొందించాలని మచిలీపట్నానికి చెందిన గుదిమెట్ల శ్రీకర రామానుజుల స్వామి ఉద్బోధించారు. చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘ భవనంలోని గీతామందిరంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి రామానుజుల వారి ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ధనుర్మాస విశేషాన్ని, తిరుప్పావై ప్రవచన ఆవశ్యకతను తెలియచేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని, ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ప్రవచనం అనంతరం ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష కార్యదర్శులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, కోశాధికారి తమ్మన సతీష్‌కుమార్, జూపూడి కిరణ్, వరదా రాజశేఖర్‌లు స్వామి వారిని సన్మానించారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, మహిళా సంఘం ప్రతినిధులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కర్రసాములో శ్రావణి ప్రతిభ



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కర్రసాము ఛాంపియన్‌షిప్-2024లో మచిలీపట్నం లేడీయాంప్తిల్ కళాశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని విశ్వనాథపల్లి శ్రావణి ప్రతిభ చాటింది. సబ్ జూనియర్ బాలికల విభాగంలో రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించింది. జూడో, తైక్వాండో తదితర మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి పోటీల్లో సైతం పతకాలు సాధించి ప్రశంసలు అందుకుంది. శ్రావణి తండ్రి శరత్ బడ్డీకొట్టులో మొబైల్ రిపేరు షాపు నిర్వహిస్తూ శ్రావణిని ప్రోత్సహిస్తున్నారు. శ్రావణికి కర్రసాములో శిక్షణ ఇచ్చిన కోచ్ తోట అరవింద్, శ్రావణిని పట్టణ ప్రముఖులు అభినందించారు.

రాఘవేంద్రరావు సేవలు చిరస్మరణీయం

అవనిగడ్డ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివిసీమలో కళారంగానికి ముఖ్యంగా పౌరాణిక, సాంఘిక, నాటక రంగాలకు సూరగం రామచంద్రరావు చేసిన సేవలు మరువలేనివని కళాకారులు అన్నారు. స్థానిక ఆరో వార్డులో నాటక కళాకారుడు సూరగం రామచంద్రరావు - పార్వతమ్మ దంపతుల సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆనంద్ పాల్గొని మాట్లాడుతూ తెలుగు నాటక రంగంతో రామచంద్రరావుది విడదీయరానిదని, ఆయన జీవిత కాలం నాటక రంగమే ఊపిరిగా బతికారని అన్నారు. రామచంద్రరావు - పార్వతమ్మల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుమారులు జగన్మోహనరావు, రామకృష్ణ, పౌరాణిక రంగ స్థల నటుడు పుప్పాల వీరాంజనేయులు, కళాకారులు పి.నాంచారయ్య, అర్జునరావు, వేముల అంకం బొట్లు, నారాయణరావు, వీరాచార్యులు, కారాని రామ్‌కుమార్, సోదగాని వీర వెంకట రంగారావు, గాజుల కృష్ణమూర్తి, బోలెం రామారావు, బెల్లంకొండ ఏడుకొండలు, చింతలపూడి నాగేశ్వరరావు, రామకృష్ణ, నారేపాలెం వేణు తదితరులు పాల్గొన్నారు. ఐఏఎస్ అధికారి శ్రీధర్ బాబు కళాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలతో సత్కరించారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయండి

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనవరి 5 తేదీన విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి లింగం బసవ శంకరరావు పిలుపునిచ్చారు. మోదుమూడి గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అన్నపరెడ్డి కృష్ణ, టీటీడీ ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు, మొవ్వ రఘుశేఖర ప్రసాద్, కొండవీటి పూర్ణిమ, భక్తులు పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో వైభవంగా పడిపూజ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో ఆదివారం రాత్రి వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ జరిగింది. నిలువెత్తు కటౌట్ల మధ్య అయ్యప్ప స్వామి 18 మెట్లు ఏర్పాటు చేశారు. కేరళ సంప్రదాయ సిద్ధంగా కేరళ తంత్రి అయ్యప్ప స్వామికి అర్చనలు చేశారు. 18 మెట్లపై 18 రకాల ద్రవ్యాలతో అర్చనలు జరిపారు. వందలాది అయ్యప్పలు భక్తి పారవశ్యంతో నాట్యం చేస్తూ భజనలు చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములు పాల్గొన్నారు.



చిట్టిగూడూరు బస్టాప్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

గూడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం చిట్టి గూడూరు గ్రామ బస్టాప్ వ్ద ఈనెల 27వ తేదీ రాత్రి సుమారు 50 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సిమెంటు రంగు ప్యాంట్, ఆలివ్‌గ్రీన్ టి షర్ట్ ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా గూడూరు ఎస్సై సత్య నారాయణ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9440796421 ఫోన్ నెంబరుకు ఫోన్ చేసి తెలియ జేయాల్సిందిగా కోరారు.